# నవ్వుతూ బతకాలి

మరో గంటకు వ్యాన్ హైద్రాబాదు చేరుకొనున్నది.

"ఇంకా చెప్పండి సార్,కవి పండితులతో మాట్లాడడమె ఓఎడ్యుకేషన్" అన్నాడు సత్యం.

" నేను మాట్లాడితెనేను నాయిష్టమొచ్చింది మాట్లాడుతాను. మీరే ప్రశ్నలు అడగండి తొచిన జవాబు చెపుతాను." అన్నాడు కవి.

" అడగండి పిల్లలు, మీరు ప్రశ్నలు అడగండి" అన్నాడు సత్యం.

విద్యార్థులు ఒకరి ముఖాలు వొకరు చూసుకుంటూ తమకు తెలియంది అడిగి తెలుసుకోవాలని సిద్ధమౌతు ఏదో భయం ఆవరించగ వెనక ముందు ఆలోచిస్తువున్నారు. అది చూసిన కవి --

" అడగండి భయపడతారెందుకు" నవ్వుముఖంతో అడిగాడు కవి.

" ఏదో తట్టినట్టు కదులుతు మూర్తి మనిషికి భయం ఎందువల్ల అవుతుంది సార్" అడిగాడు.

" తప్పుచేయడం వల్లా, తప్పుడు ఆలోచనలు చేయడంవల్లా".

" ఏది తప్పో, ఏదిఒప్పో ముందె ఎట్లా తెలుస్తుంది సార్" శర్మ.

" తెలుపు నలుపు ఎట్లా గుర్తిస్తాము"

" చూసి"

" గుడి గంటో, బడిగంటో ఎట్లా తెలుసుకుంటాము"?

" శబ్దంద్వార"

" నిప్పు-నీరు వేరు వేరుగున్నట్టు, మంచి - చెడులు వేరువేరుగ వుంటాయి. వాని వునికితో కొంతగాకున్న కొంతైన ముందె మనకు ఓ మాదిరి స్పృహ వుంటుంది. అది మనలో ప్రకృతి పరిసరాలు పెంచే ప్రాథమిక జ్ఞానం, దాని ద్వార తప్పొప్పును గుర్తించవచ్చు.

" భయం తొలగాలంటే సార్" మరో విద్యార్థి.

" అనవసరపు అనుమానాలను, దురాలోచనలను దరిచేరనీయొద్దు. మన బుద్ధిని పెంచుకుంటె చాలు అది మన దగ్గర్కి రాదు" అన్నాడు కవి.

" మంచి పనులు చేస్తే తృప్తి, చెడుపనులు చేస్తే భయం వెంటాడుతువుంటుంది" అన్నాడు సత్యం.

" ఈ జరిగే చెడులన్ని ఎందుకు జరుగుతున్నట్టు సారు" రెడ్డి అడిగాడు.

" అత్యాశవల్లా, ధనం మీద,పదవి మీద భూమిమీద, యింకాయింకా తనదికాని దానికోసంచేసే ప్రయత్నాలె సకలఅనర్థాలకు దారితీస్తాయి."

" అత్యాశ కొంపకు చేటు సామెతే వుందికదండి" అన్నాడు సత్యం.

అవును అన్నట్టు నవ్వాడు కవి.

" భయం వల్లనే మనిషి రాళ్లకు రప్పలకు మొక్కి దాన్ని అదుపులో పెట్టుకుంటాడు" అన్నాడు సత్యం.

" అంతవరకు పర్వాలేదు. మధ్యన ఈ బాబాలు, స్వాములు, మాయగాల్లు మోసం చేస్తువున్నారు. అమాయకుల కష్టార్జితాన్ని వొలుచుకుని, బూడిదతో నామాలు పెడుతున్నారు. వాళ్లు విసిరె వలలో పడకుండ చూసుకోవాలి" అన్నాడు కవి.

"అదె మనం గట్టు జాతర ఆగినపుడు చెప్పాను చూడు సైంటిఫిక్ తాట్ అంటే శాస్త్రీయమైన ఆలోచన పెంచుకోవాలి అని.

ఇక్కడగూడ అదేకావాలి. అదే బుద్దిని పెంచుకోవాలి. బుద్దిపెరగాలి అంటె చదవాలి" అన్నాడు సత్యం.

" అంటె ప్రతివాడు సైంటిస్ట్, ప్రతివాడు పండితుడు కానక్కరలేదు. నిత్యజీవితంలో తాను కష్టాలకు గురికాకుండ ఉండె తెలివితేటలుంటె చాలు. పక్కవాడు చేసేమోసాన్ని పసికట్టగలిగితేచాలు. అంతెకాదు తెలుగులో మహారచయిత రావిశాస్త్రి గారన్నట్టు మంచికోసం నిలవకపోయినా చెడుకు ఆసరాగా వుండొద్దు" అన్నాడు కవి.

" సాహిత్యం చాటేది ఒకటి, నిజజీవితంలో జరిగేది మరోకటి! మనిషిలో సంస్కారం పెరగక ఎంత సాంకేతిక అభివృద్ధిని సాధించినా, అది వినాశనానికే గాని ప్రగతికోసం పనిచేయడం లేదండీ, రోజు రోజుకు విచ్చలవిడితనం విధ్వంసం పెరిగిపోయి సాధారణ జన జీవితాన్ని అస్తవ్యస్తం చేస్తూ వుంది" అన్నాడు సత్యం ఎంతో విసుకు చెందినట్టు.

" సమాజంలో అమానవీయత పెరిగి మనిషికి మనిషికి మధ్యన పరాయితనం పెరుగుతువుంది. అందువల్లా మనుషుల్లో మానవత్వాన్ని పెంచే శ్రద్ధను మేధావి వర్గమైన కవులు, రచయితలు, కళాకారులు శాస్త్రజ్ఞులు చేయవల్సివుంది. దానికి ప్రతి సామాన్యుడు కూడ దోహదం చేయాలి. వీళ్లు - ఈ విద్యార్థులు మనకంటె మంచి జీవితాన్ని పొందే అవకాశం మనం కల్పించవల్సి వుంది" అన్నాడు కవి.

" మంచి కోసం ఆశించడం తప్పేమికాదుకదా. లెటజ్‌హోప్. కాని ఎవరిని చూసిన ఏదో అసంతృప్తి, ఏదో టెన్షన్, రోగాలు - నొప్పులు ఆకాలమరణాలు ఒకవైపు, దొంగతనాలు - దోపిడీలు, హత్యలు, టెర్రరిజం, విచ్చలవిడి విధ్వంస చర్యలు మరొకవైపు అంతెందుకుసార్, పార్లమెంట్‌లో మనప్రతినిధుల ప్రవర్తన అసెంబ్లీలో మన శాసన సభ్యులు కొట్లాట - ఏమోసార్ ఒక్కొక్కసారి ఎటుతోయని పరిస్థితి." అంటూ తలను వంచుకుని కుడి చేతిని గాలిలో వూపాడు సత్యం.

విద్యార్థులు ఎంతో ఆసక్తిగ వింటువున్నారు. గొర్రెలమంద అడ్డంరాగ వ్యానునుకాస్త స్లో చేసి వాటిని తప్పుకొని మళ్లి స్పీడ్ పెంచాడు డ్రైవర్, క్లీనర్ తనకు ఎడమవైపు వున్న గుట్టలశ్రేణి గమనిస్తువున్నాడు.

" మీ పేరేమన్నారు? సత్యం కదా?"

అవును అన్నట్టు తల ఊపాడు.

"చూడండి,సత్యం,ఒక్కమాటలో చెప్పాలంటే మనిషి నవ్వలేకపోతున్నాడు. మనిషి మనసారా నవ్విన్నాడు, ఈ చెడ్డ తలంపులు ఈ టెన్షన్లు, అకాలమరణాలు వుండవు. అందువల్ల నవ్వుతూ బ్రతికేటట్టు మనం జనాన్ని ఎడ్యుకేట్ చెయ్యాలి. విద్యార్థి దశలో సంస్కరణ సంయమనపు విత్తనాలు నాటితే ఆ తరువాత మనిషితో పాటే అవి పెరిగి ఓ మంచి ఆరోగ్యకరమైన వాతావరణం సమాజంలో చోటు చేసుకుంటుంది.